వాసవీ మాతా నమోస్తుతే !

వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోని వాసవీమాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కలశాలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో కొలువుదీర్చి భక్తిశ్రద్ధలతో ఊరేగింపులను నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – సాక్షిబృందం



రాయదుర్గం: అలంకరణలో వాసవీమాత



ఉరవకొండ: పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



బొమ్మనహాళ్: కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు



కణేకల్లులో కోలాటం ఆడుతున్న భక్తులు



రాయదుర్గం: కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

క్లుప్తంగా

పుస్తకాల పేరుతో వేల రూపాయల దోపిడీ



పట్టణంలోని నారాయణ స్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గంలో ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ పుస్తకాల పేరుతో వేల రూపాయలు దోపిడీ చేస్తున్న నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని నారాయణ స్కూల్ ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రకరకాల గ్రూపులు నిర్వహిస్తున్న నారాయణ విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థల ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నియోజవర్గ ఉపాధ్యక్షుడు బాలు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు హర్షవర్ధన్, అఖిల్, రమేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదం నశించాలి



కంబదూరులో ర్యాలీ చేపడుతున్న స్థానికులు

కళ్యాణదుర్గం: ఉగ్రవాదం నశించాలంటూ కంబదూరు స్థానికులు జాతీయ జెండాలను చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. బుధవారం స్థానిక పుట్టన్న గారి వీధి కాలనీవాసులు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పోస్టాఫీసు సర్కిల్ వరకు ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ సైనికులు చేసిన పోరాటం ఎంతో గొప్పదని సంతోషం వ్యక్తం చేశారు. ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు గాజుల మారుతి, ఆటో రాజు, నాగేంద్ర, చంద్రకళ, నాగమణి, సుధమ్మ, రేణుక, సంధ్య, మంగమ్మ, అనూష, కావ్య, యశోద, ప్రతాప్, హర్షతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం



వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కణేకల్లు: కణేకల్లులో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. స్వామి చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఉంచి ఆలయం నుంచి బస్టాండ్ వరకూ ఊరేగించారు. చిన్నారులు కలశాలతో ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు.
వజ్రకరూరు: గూళ్యపాళ్యం గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో స్వామికి ఆకుపూజ, పంచామృతాభిషేకం, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం స్వామి వారి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

విడపనకల్లు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కృష్ణమూర్తి, రఘురాం, వెంకట రమేష్, వేణుగోపాల, అరవింద్, భాషా తదితరులను సన్మానించారు.

కాంగ్రెస్ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పలువురు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన పారిశ్రామిక వేత్త బెస్తరపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ శీనప్ప, కంబదూరు మండలం గొల్లపల్లి సర్పంచు రామాంజనేయులు పార్టీలో చేరారు. వారికి వైఎస్ జగన్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శెట్టూరు జెడ్పీటీసీ మంజునాథ్, డీసీసీబీ డైరెక్టర్ నాగిరెడ్డిపల్లి రామాంజనేయులు, నాయకులు కంబాలపల్లి శివ, శ్రీనివాసరెడ్డి, శీగలపల్లి సుదర్శన్‌రెడ్డి, అండేపల్లి బాబురెడ్డి, జయం ఫణి తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నారాయణ స్కూల్ వద్ద ధర్నా

రాయదుర్గంటౌన్: ముందస్తు అడ్మిషన్లు, విద్యా సంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లాశాఖ కోశాధికారి ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక నారాయణ స్కూల్ ముందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో సంతోష్, యోగేందర్, మాంతేష్, నవీన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణ విద్యాసంస్థ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మొక్కుబడిగా మండల సమావేశం

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. సమావేవం 10:30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 11:30 గంటల తర్వాత మొదలైంది. రెవెన్యూ శాఖ అధికారులు, పశు ప్రధాన వైద్యాధికారి హాజరు కాకపోవడంతో వైస్ ఎంపీపీ దేవా ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామికి సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్ ఆలస్యంగా హాజరయ్యారు. రహదారులు, శ్మశాన వాటికలకు పొజిషన్ సర్టిఫికెట్స్, పట్టాలిస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని సర్పంచులు హనుమంత రెడ్డి, ధనుంజయ తదితరులు డీటీ దృష్టికి తీసుకెళ్లారు. మెకానిక్ లేక చేతి పంపులు మరమ్మతులకు నోచుకోలేదని అధికారులకు వివరించారు. ఆధార్ సెంటర్ల నిర్వాహణ సక్రమంగా చేపట్టడం లేదని.. ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సభ్యులు ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు. కాగా.. చాలా గ్రామాల్లో ప్రజా సమస్యలు ఉన్నప్పటికీ ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకుపోలేక పోయారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు సర్దార్ వలి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, హౌసింగ్ డీఈ హనుమప్ప, డాక్టర్ ఉషారాణి, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, ట్రాన్స్‌కో ఏఈ గౌస్, ఏఓ విజయ కుమార్, ఏపీఓ పోలేరయ్య, ఏపీఎం దేవానంద ఫిలిప్స్‌న్, వెటర్నరీ డాక్టర్ శ్వేత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ హనుమంతరెడ్డి

వైద్యుల భర్తీకి ప్రతిపాదనలు

వజ్రకరూరు: కొనకొండ్లలోని సీహెచ్‌సీ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల భర్తీకి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ తెలిపారు. బుధవారం సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు వార్డులను పరిశీలించి, పేషంట్లతో మాట్లాడారు. అనంతరం డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ఈఎన్‌టీ, ఆప్తమాలజీ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటి భర్తీకి డైరెక్టర్ సెకండరీ హెల్త్ వారికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ఆసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈనెల 9వ తేదీన ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సేఫ్‌రూం-సేఫ్‌వార్డు ఏర్పాటుకు ఆస్పత్రిని పరిశీలించారు. సేఫ్ వార్డులో ఉన్న సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ వైద్యసేవ (ఆరోగ్య శ్రీ) జిల్లా కో-ఆర్డినేటర్ కిరణ్‌కుమార్ రెడ్డి, సూపరింటెండెంట్ దొరస్వామి, డీడీఓ లలిత, వైద్యులు పాల్గొన్నారు.



సీహెచ్‌సీలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం



పార్టీ నేతలతో మాట్లాడుతున్న ఉమా

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేద్దామని ఆ పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వరనాయుడు పార్టీ నేతలకు సూచించారు. బుధవారం కంబదూరు మండలం రాళ్లపల్లి గ్రామానికి చెందిన పలువురు నేతలు కళ్యాణదుర్గంలోని మాదినేని ఉమామహేశ్వరనాయుడు క్యాంపు కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేసి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేద్దామన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



కార్యక్రమంలో పాల్గొన్న అనంత వెంకటరామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, తలారి రంగయ్య

రాయదుర్గం: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి, రాయదుర్గం, కళ్యాణదుర్గం సమన్వయకర్తలు మెట్టు గోవింద రెడ్డి, తలారి రంగయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. బుధవారం పట్టణంలోని బైపాస్ రోడ్డులో వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకుడు, క్లాస్-1 కాంట్రాక్టర్ కొత్తపల్లి గొని సత్యనారాయణరెడ్డి నూతన గృహ ప్రవేశానికి వారు హాజరయ్యారు. అక్కడే ఏర్పాటు చేసిన సత్యనారాయణ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం ఎంపీడీఓగా విజయసింహారెడ్డి



బ్రహ్మసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా విజయసింహారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు జిల్లా గూడూరు మండల పరిషత్ కార్యాలయ ఏఓగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యాలయ సిబ్బంది నూతన ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

బొమ్మనహాళ్: ఉపాధి హామీ పథకం పనుల్లో నిబంధనలు తప్పక పాటించాలని ఎంపీడీఓ విజయభాస్కర్ కూలీలకు సూచించారు. బుధవారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ దాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ షాక్‌తో రైతుకు గాయాలు

కూడేరు: మండల పరిధిలోని మరుట్ల-3 కాలనీలో బుధవారం బాలరాజు అనే రైతు విద్యుత్ షాక్‌తో గాయపడ్డాడు. బాలరాజు తన పొలంలో మోటార్ ఆన్ చేసేందుకు స్టార్టర్ పెట్టెను తాకడంతో పెట్టెకు విద్యుత్ సరఫరా అయ్యింది. విద్యుత్ షాక్‌కు గురైన రైతు బిగ్గరంగా అరవడంతో పక్క పొలం రైతు రామకృష్ణ వెంటనే వచ్చి టవాల్‌తో చేతిని గట్టిగా లాగి రక్షించాడు. గాయపడిన రైతును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అన్ని రంగాల్లో నైపుణ్యాలు అవసరం

కూడేరు: విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో నైపుణ్యం కల్గి ఉండాలని కూడేరు గ్రంథాలయాధికారిణి రాధా రాణి అన్నారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా బుధవారం కూడేరు గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు చెప్పడం, ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. పలువురు పిల్లలు అద్భుతంగా పాటలు పాడారు. ఆటల పోటీల్లోనూ ప్రతిభ కనబరిచారు. గ్రంథాలయాధికారిణి రాధారాణి మాట్లాడుతూ.. ఏకాగ్రతతో పని చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది వసంత, ఆరుద్య గౌడ్, పాఠకులు పాల్గొన్నారు.

10న వైద్య శిబిరం

వజ్రకరూరు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 10న శాంతిరాం కంటి ఆస్పత్రి కర్నూలు వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి, గుండె ఆపరేషన్ల శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ మోనాలిసా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు.

ముగిసిన అక్కదేవతల జాతర

కూడేరు: మండల పరిధిలోని కరుట్లపల్లిలో ఈనెల 2న ప్రారంభమైన అక్క దేవతల జాతర బుధవారం వసంతోత్సవం కార్యక్రమంతో ఘనంగా ముగిసింది. చివరి రోజు మహిళలు పెద్ద ఎత్తున అక్క దేవతల ఆలయం వద్దకు తరలివచ్చారు. ఉత్సాహంగా కుంకుమ, పసుపు నీళ్ల కలిపిన నీటితో వసంతమాడారు. అక్కమ్మ తల్లుల్లారా గ్రామం సుభిక్షంగా ఉండేలా చూడండి తల్లీ అంటూ గ్రామస్తులు వేడుకున్నారు.

ఉపాధి హామీ కూలీకి పాము కాటు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్‌లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి పనులకు వెళ్లి ఓ కూలీకి పాటు కాటు వేసింది. స్థానికుల వివరాల మేరకు.. ఉద్దేహాళ్‌కు చెందిన వన్నూరుస్వామి ఉపాధి పనులకు వెళ్లాడు. కాలువ పనులు చేస్తుండగా పని ప్రదేశంలో విష పాము కాటు వేసింది. స్థానికులు వెంటనే అతన్ని బళ్లారి విమ్స్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్‌డీ దాస్ బాధితుడిని పరామర్శించి రూ.2 వేలు వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందించారు.

'ఉపాధి' పనులు కల్పించాలి

కూడేరు: ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల పరిధిలోని ఉదిరిపికొండకు చెందిన కూలీలు నాగభూషణ, అనిల్, దేవాదీనం, నాగేంద్ర తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. నెలన్నర నుంచి పనులు కల్పించాలని కోరుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పొలాల్లో కూడా పనులు లేవని.. ఉపాధి ద్వారా పనులు కల్పిస్తే వచ్చే కూలి డబ్బుతో కుటుంబాన్ని పోషించుకోవడానికి వీలుంటుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులు కల్పించాలని కోరారు.

అవగాహనతో మధుమేహానికి చెక్

రాయదుర్గంటౌన్: అవగాహన, జాగ్రత్తలతో మధుమేహం, క్యాన్సర్ లాంటి వ్యాధులను అరికట్టవచ్చని హెల్త్ సెంటర్ వైద్యుడు జశ్వంత్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఎన్‌సీడీ-సీడీ సర్వేలో భాగంగా బుధవారం స్థానిక చౌడేశ్వరదేవి కాలనీలో అనుమానిత మధుమేహం, డయాబెటిస్ కేసులను వైద్యులచే పరీక్షలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

తాగునీటి ఎద్దడిని అరికట్టండి

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం నియోజవర్గం వ్యాప్తంగా నీటి ఎద్ద తీవ్రంగా ఉందని, వెంటనే అధికారులు సమస్యను పరిష్కరించాలని సీపీఐ నియోజవర్గ కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. బుదవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన నాయకులతో విలేకరులతో మాట్లాడారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను సొంత నిధులతో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఇచ్చిన హామీ నీటిమూటలే అని విమర్శించారు. కళ్యాణదుర్గం నుంచి కన్నేపల్లి రోడ్డు నిర్మిస్తానని చెప్పి ఇప్పటి వరకూ పట్టించుకోలేదన్నారు.

మసీదుల్లో ఇస్లామిక్ సమ్మర్ క్యాంపులు

రాయదుర్గంటౌన్: మక్తబ్ ఏ దీనియాత్ రాయదుర్గం ఉల్మ ఆధ్వర్యంలో పట్టణంలోని మక్కా మసీదు, జామియా చౌక్ మసీదు, టిప్పు మసీదు, ఖుబ మసీదు, గౌసే ఆజం దర్గా మసీదుల్లో 'దీని మక్తబ్ ఇస్లామిక్ సమ్మర్ క్యాంపు' నిర్వహిస్తున్నారు. 6 నుంచి 10 ఏళ్ల వయస్సు గల చిన్నారులకు ఉదయం గంట పాటు బోధన, నెలరోజుల పాటు ఉంటుందని మక్కా మసీదు ముఫ్తీ నూర్ మొహమ్మద్, మౌలానా ఏజాజ్ ముస్తఫా తెలిపారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

కూడేరు: కొత్త రేషన్‌కార్డులు మంజూరుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని సీఎస్‌డీటీ లక్ష్మీదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు, తొలగింపు, ఇతర ప్రాంతాలకు మార్పు, ఆధార్ నంబర్ మార్పు, అడ్రస్ మార్పుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉత్తీర్ణత సాధించాలి

వజ్రకరూరు: ఈనెల 19వ తేదీ నుంచి పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ తిమ్మప్ప సూచించారు. బుధవారం కొనకొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణ తరగతులను పరిశీలించారు. హెచ్‌ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, పార్టీ నేతలు

కుందుర్పి: తెనగల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్ల శివన్న, సునీతమ్మ కుమారుడు ఉమేష్, భార్గవిల వివాహం కర్ణాటక రాష్ట్రంలోని వైఎన్ హెచ్ కోట వద్ద చౌడేశ్వరి కల్యాణమండపంలో బుధవారం జరిగింది. వివాహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రఘునాథ్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, తలారి సత్తి, స్థానిక సర్పంచు వెంకటేష్, ఎంపీపీ కమల నాగరాజు తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. సర్పంచులు రామ్మూర్తి, విజయ్, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిప్పేస్వామి, కురుబ సంఘం తాలూకా అధ్యక్షుడు శ్రీనివాసులు, మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మి, నాయకులు లింగప్ప, జిన్నా ఓబిలేశులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రస్థావరాలపై దాడికి మద్దతు



ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: పాకిస్తాన్‌లో ఉగ్రస్థావరాలపై భారత ఆర్మీ చేపట్టిన దాడులకు వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి క్లాక్ టవర్ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టారు. ఉగ్రవాదం నశించాలి.. జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సింగాడి తిప్పయ్య, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు బసవరాజు, వైస్ ఎంపీపీ ఈడిగ ప్రసాద్, పార్టీ రూరల్, మండల కన్వీనర్లు ఓబన్న, ఎర్రిస్వామిరెడ్డి, వడ్డే ఆంజనేయులు, ఆసిఫ్, జోగి వెంకటేష్, లత్తవరం గోవిందు, మైనుద్దీన్, అంగడాల ఆంజి, పచ్చి రవి, నాగన్న, బూదగవి ధనంజయ, జోగి భీమా, రాయల్ మల్లికార్జున, జేసీబీ రామకృష్ణ, చిన్న భీమా, సోమశేఖర్, బాషా, మహనంది అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు ఎంపీడీఓగా సూర్యనారాయణ

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు ఎంపీడీఓగా సూర్యనారాయణను నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా దేవకొండ మండలంలో విధులు నిర్వహిస్తున్న సూర్యనారాయణ పదోన్నతిపై ఇక్కడికి రానున్నారు.

వాహనాలిలా.. వెళ్లేదెలా?



మొలకాల్మూరు రోడ్డు బ్యాంకు వద్ద సగానికి పైగా రోడ్డుపై వాహనాల పార్కింగ్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరోడ్డు యూనియన్ బ్యాంకు (ఆంధ్రాబ్యాంకు) ముందు ప్రధాన రహదారిపై పాదాచారులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సగానికిపైగా రోడ్డుపై వాహనారుల పార్కింగ్‌తో రోడ్డు కనిపించని పరిస్థితి ఉంది. అంతేకాక బ్యాంకు పక్కనే కల్యాణ మంటపం కూడా ఉండడంతో పెళ్లిల సమయంలో అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు దీనిపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

ప్రమాదం వెంట ప్రయాణం



గొల్లపల్లి వైపు నుంచి రాయదుర్గానికి వస్తున్న ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న గ్రామీణులు

రాయదుర్గంటౌన్: పట్టణానికి వివిధ గ్రామాల నుంచి ప్రయాణీకులను తీసుకున్న ఆటోలు తరుచూ ఏదో ఒక చోట ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆయా ఘటనల్లో తీవ్రంగా గాయపడుతుండటంతో పాటు ప్రాణాలు కూడా గాల్లోకి కలసిపోతున్నాయి. ఆటోల్లో ప్యాసింజర్లను అధికంగా ఎక్కించుకుంటున్నా పోలీసులు కూడా పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. పట్టణం నుంచి అనంతపురం వైపు, బళ్లారి వైపు, బీటీపీ, అడిగుప్ప, కణేకల్లు, మొలకాల్మూరు రహదారుల వైపు నుంచి ఆటోలు ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నాయి.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



మాట్లాడుతున్న నియోజకవర్గ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ

కూడేరు: చిన్న వయస్సులో గర్భం దాల్చితే తల్లీబిడ్డ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తుందని నియోజకవర్గ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ హెచ్చరించారు. బుధవారం కూడేరులోని ఆరోగ్య ఉపకేంద్రంలో 'టీనేజ్ ప్రెగ్నెన్సీ' ద్వారా కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయస్సుకే బాలికలకు పెళ్లి చేసి బాధ్యత తీరిపోయిందని అనుకోవద్దన్నారు. బాల్య వివాహాలతో ఎదురయ్యే సమస్యలతో బాధపడాల్సి వస్తుందన్నారు. ఎక్కడైన బాల్య వివాహాలు చేస్తుంటే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు యశోద, రవీంద్ర, ఏఎన్ఎం చంద్రకళ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.